సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 9 । అక్టోబర్ । 2024



కమిటీని ఎవరు నియమించారు?

నూజివీడు శ్రీ కోట మహిషాసురమర్దని ఆలయానికి ఉత్సవ కమిటీ నియమించకుండానే కొందరు కూటమి నాయకులు, కార్యకర్తలు సభ్యులుగా చలామణీ అవుతున్నారు. IIలో ▸



పసిడి పరుగులు

బంగారం ధరలు ఆల్‌టైం హైలో కొనసాగుతున్నాయి. మంగళవారం నరసాపురంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.78,200 వద్ద ట్రేడయ్యింది. IIలో ▸



వెలుగురేఖను ఆర్పేశారు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కంటి వైద్యం అందిస్తున్న కేంద్రాల గడువు ముగిసినా రెన్యువల్ చేయకపోవడంతో కాంట్రాక్టు సంస్థలు సామగ్రిని తరలించుకుపోతున్నాయి. IIలో ▸

న్యూస్‌రీల్

ఉండి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి



ఎస్పీ అద్నాన్ నయీం అస్మిని కలిసిన మాలసంఘాల జేఏసీ నేతలు

భీమవరం: కాళ్ల మండలం ఏలూరుపాడులో అంబేడ్కర్ ఫ్లెక్సీ పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఎఫ్ఐఆర్ నమోదుచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాలసంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లి రాజేష్ అన్నారు. మంగళవారం భీమవరంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మిని కలిసి వినతిపత్రం అందించారు. ఫ్లెక్సీ చించివేతపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోగా జేఏసీ నాయకుల్ని గృహనిర్బంధం చేయడం దారుణమన్నారు. మాలల హక్కుల కోసం శాంతియుతంగా పోరాటానికి అనుమతులు ఇవ్వకుండా కట్టడి చేయడం అవమానపర్చడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్పీని కలిసిన వారిలో బహుజన జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి మధు, గంటా సుందరకుమార్, గుండే నగేష్, కాటం స్టాన్లీ, బిరుదుగడ్డ రమేష్, సోడదాసి గంగయ్య, పరువు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో బాధ్యతల స్వీకరణ

తాడేపల్లిగూడెం: గూడెం రెవిన్యూ డివిజినల్ అధికారిగా వై.భవానీశంకరి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ స్వాగతం పలికారు.

4 నుంచి పల్లె పండుగ

భీమవరం (ప్రకాశంచౌక్): గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం సెప్టెంబర్ 14న తలపెట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో గ్రామసభలో తీర్మానించిన పనులకు శ్రీకారం చుట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. పల్లె పండుగ కార్యక్రమంపై మంగళవారం డిప్యూటీ సీఎం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి కలెక్టర్ నాగరాణి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రూ.51.03 కోట్లతో 423 పనులను పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. పల్లె పండగపై ప్రజా ప్రతినిధులకు ముందుగా తెలియజేస్తామని అన్నారు.

భీమవరంలో 40 మి.మీ వర్షపాతం

భీమవరం: జిల్లా వ్యాప్తంగా మంగళవారం 198.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా అత్యధికంగా భీమవరంలో 40.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది కాళ్లలో 38.2, పాలకోడేరులో 23.6, తాడేపల్లిగూడెంలో 11.2, పెంటపాడులో 2.4, తణుకులో 9.6, అత్తిలిలో 14.2, గణపవరంలో 16.4, ఉండిలో 16.2, వీరవాసరంలో 10.8, మొగల్తూరులో 6, నరసాపురంలో 3.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

ఇగ్నోలో వివిధ కోర్సులకు ప్రకటన జారీ

ఏలూరు (టూటౌన్): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)లో వివిధ దూర విద్యాకోర్సులతోపాటు ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రభుత్వం ప్రకటన జారీ చేసింది. విశ్వవిద్యాలయం అందిస్తున్న అన్ని డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా పొందాలి. అన్ని కోర్సులలో ప్రవేశాలకు ఈ నెల 15వ తేదీని గడువుగా నిర్ణయించారు. సాధారణ బీఏతో పాటు ఎంబీఏ(హెచ్ఆర్, మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్ కోరుల్ని అందిస్తున్నారు. పూర్తి వివరాలకు 9490350469 నెంబరులో సంప్రదించాలి.

ఇక మద్యం ఏరులే..

- టీడీపీ సిండికేట్ల నుంచి భారీగా మద్యం షాపులకు దరఖాస్తులు
- ఆరు ప్రధాన సిండికేట్ల నుంచే 1,500 దరఖాస్తులు
- అంతా ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే
- ఇతరులకు షాపులు వస్తే తీవ్ర పరిణామాలంటూ హెచ్చరికలు
- పర్సంటేజీలు ఫిక్స్.. ఇవ్వకుంటే కేసులే..
- నేటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ



సాక్షి ప్రతినిధి, ఏలూరు: లిక్కర్ సిండికేట్ల దందాతో టీడీపీ నేతలు జిల్లాలో మద్యం మాఫియాకు తెరలేపారు. మద్యం దుకాణాల కోసం ఎవరూ దరఖాస్తు చేయకుండా అడ్డుకోవడంతో పాటు.. నేరుగా ఎమ్మెల్యేల కార్యాలయాల నుంచే అనుమానం ఉన్న వారికి ఫోన్లు చేయించి బెదిరించారు. దీంతో దాదాపు అన్ని మద్యం దుకాణాలూ సిండికేట్లకే దక్కనున్నాయి. ఎమ్మెల్యేలతో పర్సంటేజీలు ఖరారు చేసుకుని జిల్లాలో టాప్– 50 అమ్మకాలు ఉండే షాపులపై ఎక్సైజ్ సీఐలతో ప్రత్యేక మంతనాలు చేసి ఖరారు చేసుకుంటున్నారు. మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సిండికేట్లు వందల సంఖ్యలో దరఖాస్తు చేశారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలో 7 సిండికేట్ల నుంచి 1500లకు పైగా దరఖాస్తులు ఒక్క రోజే అందాయి. దీంతో నిన్నటి వరకు స్వీకరించిన దరఖాస్తులకు కంటే ఒకే రోజు ఎక్కువగా అందడంతో ఎక్సైజ్ కార్యాలయాలు కిటకిటలాడాయి. మంగళవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా టెండర్ దాఖలు ప్రక్రియలో సిండికేట్ల హవా కొనసాగింది. ఎమ్మెల్యేల ప్రధాన అనుచరులుగా ఉండే వ్యక్తులు సిండికేట్లలో రింగ్ లీడర్లుగా మారారు. దీంతో అన్ని నియోజకవర్గాల్లో సిండికేట్ల హవా కొనసాగింది. ఈ నెల 2న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా.. 7వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో సుమారు 2,300 దరఖాస్తులు వచ్చాయి. అయితే మంగళవారం ఒక్కరోజే ఉమ్మడి జిల్లాలో సుమారు 2500 దరఖాస్తులు అందినట్లు సమాచారం. ఇంతవరకూ 5,500కు పైగా దరఖాస్తులు అందాయి.

పశ్చిమ గోదావరి జిల్లాలో..

అదే విధంగా పాలకొల్లులో ప్రధాన సిండికేట్ సుమారు 180, భీమవరంలో ప్రధాన సిండికేట్ జిల్లా వ్యాప్తంగా అన్ని షాపులకు కలిపి 290, కొవ్వూరులో ఉండే బడా సిండికేట్, మరో సిండికేట్ కలిపి 700కుపైగా దరఖాస్తులు దాఖలు చేశారు. జంగారెడ్డిగూడెంలోనూ సిండికేట్ల హవా ఎక్కువగా ఉంది. సోమ, మంగళవారాల్లో రెండు ప్రధాన సిండికేట్లు 300 వరకు దరఖాస్తులు సమర్పించారు. ప్రతి దరఖాస్తు సంబంధించిన పూర్తి సమాచారం సిండికేట్ సభ్యులు ప్రజాప్రతినిధులకు ఇచ్చి అవసరమైన వారందరికీ ఫోన్లు చేయిస్తున్నారు.

ఇక ఆన్‌లైన్ దరఖాస్తులు కూడా పెద్ద సంఖ్యలో నమోదవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా మంగళవారం డీడీల స్వీకరణ విషయంలో ఎక్సైజ్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో కొంత గందరగోళం నెలకొంది. స్థానికంగా బ్యాంకుల్లో డీడీలకు ప్రత్యామ్నాయంగా బ్యాంకు చెక్కులు జారీ చేస్తున్నారు. వ్యాపారులు అప్లికేషన్‌తో పాటు వీటిని జత చేసి ఇస్తుండటంతో అధికారులు అభ్యంతరం తెలిపారు. దీనిపై సాయంత్రం వరకు తర్జనభర్జనలు కొనసాగాయి. బుధవారం దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

దెందులూరు, ఏలూరు, కైకలూరులో సిండికేట్ల హవా

ఏలూరు జిల్లాలో 144 షాపులు, పశ్చిమ **గోదావరి జిల్లాలో** 174 షాపులు ఉన్నాయి. ప్రధానంగా దెందులూరు, ఏలూరు, కైకలూరు **నియోజకవర్గాల్లో** సిండికేట్లు పెద్ద సంఖ్యలో **దాఖలు చేశారు.** కైకలూరులో బీజేపీ ఎమ్మెల్యేకి సన్నిహితంగా ఉండే టీడీపీ నేత నియోజకవర్గంలోని 21 షాపులకు కలిపి సిండికేట్ సిద్ధం చేశారు. మంగళవారం 75 దరఖాస్తులు సమర్పించారు. ఏలూరు ఎక్సైజ్ కార్యాలయంలో దెందులూరు సిండికేట్ల హవా కొనసాగింది. ఎమ్మెల్యే సిండికేట్ సభ్యులు 40 దరఖాస్తులు సమర్పించగా బుధవారం మరో 100 వరకు దాఖలు చేయనున్నారు. ఏలూరు ఎమ్మెల్యే సిండికేట్ కూడా మంగళవారం 50 దరఖాస్తులు దాఖలు చేశారు.

కాలం చెల్లిన సరకుల విక్రయాలపై చర్యలు



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం బస్టాండ్ వద్ద సాయిబాబా గుడి రోడ్డులో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ ట్రేడర్స్, కిరణ్ ట్రేడర్స్ దుకాణాలను సోమవారం రాత్రి జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తనిఖీ చేశారు. తనిఖీల్లో కాలం చెల్లిన చిల్లీ పౌడర్, గ్రౌండ్ నట్ ఆయిల్ ప్యాకెట్లు, కిస్మిస్, వేయించిన శనగపప్పు, సరుకులు గుర్తించారు. ప్యాకింగ్‌పై తయారీ కేంద్రాల చిరునామాలు, కస్టమర్ కేర్ నెంబర్లు, ఈ–మెయిల్ అడ్రస్‌లు లేకపోవడం గమనించారు. ప్యాక్ చేసిన వస్తువులపై నిబంధనల మేరకు సమాచారం లేనందున లీగల్ మెట్రాలజీ అధికారులు షాపుల యజమానులపై నాలుగు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వ్యాపారస్తులు తమ దుకాణాల్లో డిక్లరేషన్ లేని ప్యాకేజీ వస్తువులు అమ్మరాదన్నారు. తనిఖీల్లో జిల్లా తూనికలు, కొలతల అధికారి నాగ రాజారావు తదితరులు ఉన్నారు.

పేదల చదువులపై ఉక్కుపాదం

- పేద, మధ్య తరగతి విద్యార్థులకు సీబీఎస్‌ఈ చదువులు దూరం
- విద్యా సంవత్సరం ప్రారంభమైన 3 నెలలకు నిర్ణయం
- నష్టపోతున్నామంటూ విద్యార్థుల గగ్గోలు



ఏలూరులో సీబీఎస్‌ఈ సిలబస్ అమలు జరుగుతున్న సుబ్బమ్మదేవి హైస్కూల్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం విద్యపై నానా యాగీ చేసిన చంద్రబాబు ఇప్పుడు సీబీఎస్ఈ చదువులపై ఉక్కుపాదం మోపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో అమలులో ఉన్న సీబీఎస్ఈ విద్యను రద్దు చేసి పేదల విద్యపై తనకున్న అక్కసు చెప్పకనే చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. రాష్ట్రంలోని కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి సీబీఎస్ఈ సిలబస్ అమలు చేశారు. దీంతో పేద, మధ్య తరగి వర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత సీబీఎస్ఈ విద్యను రద్దు చేసి ఆ ఆనందాన్ని మూణ్నాళ్ల ముచ్చట చేశారు. ఈ ఏడాది నిర్వహించబోయే పదో తరగతి పరీక్షలను ఎస్ఎస్‌సీ బోర్డు విధానంలోకి మార్చుతూ ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల పాటు కష్టనష్టాలకు ఓర్చుకుని సీబీఎస్ఈ సిలబస్‌కు అలవాటు పడ్డ విద్యార్థులకు ప్రభుత్వ నిర్ణయం అశనిపాతంలా తగిలింది. ఈ నిర్ణయంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా శిక్షణ

సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. సీబీఎస్ఈ బోధనలో మెళకువలు తెలుసుకున్న ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగిస్తున్నారు. తీరా వ్యవస్థ గాడిలో పడిన తరువాత సిలబస్ రద్దు చేయడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇంత వరకు సీబీఎస్ఈ సిలబస్ చదువుకున్న విద్యార్థులకు తెలుగు, హిందీ సబ్జెక్టులపై పెద్దగా అవగాహన ఉండక ఇబ్బంది పడుతున్నారు.

3 నెలలకు తాపీగా నిర్ణయం

జిల్లా వ్యాప్తంగా 2022–23 విద్యా సంవత్సరంలో 34 ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానాన్ని 8వ తరగతి నుంచి ప్రారంభించారు. ఆపై 9వ తరగతి, 10వ తరగతికి కొనసాగించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన మూడు నెలల తరువాత ఈ విధానాన్ని రద్దు చేయడం విద్యార్థులకు శాపంగా పరిణమించింది. సీబీఎస్ఈ సిలబస్‌తో పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేస్తే జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సమాయత్తమవడం సులభమవుతుంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసంబద్ధ నిర్ణయాలపై విద్యావేత్తలు మండిపడుతున్నారు.

సీబీఎస్ఈ సిలబస్‌లో రాటుదేలిన విద్యార్థులు

జిల్లాలోని 34 సీబీఎస్ఈ పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 3,179 మంది ఉన్నారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 3,228 మంది, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు 3,710 మంది ఉన్నారు. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో 10,117 మంది నష్టపోతున్నారు. సీబీఎస్ఈ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు దేశంలో ఎక్కడికి వెళ్లినా మంచి గుర్తింపు పొందేలా శిక్షణ పొందారు. ఐఐటీ, ఎన్ఐటీ, ఎయిమ్స్, జిప్మర్, సీఎంసీ వంటి సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షలకు తర్ఫీదు పొందారు. ఒత్తిడికి లోనవకుండా ఆసక్తికి అనుగుణంగా చదువులు కొనసాగిస్తున్నారు. ఏ రాష్ట్రానికి వెళ్లినా చదువుకు ఇబ్బంది లేకుండా కొనసాగించవచ్చనే ఆత్మస్థైర్యాన్ని పొందారు. ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించుకునే సామర్థ్యం విద్యార్థుల్లో పెంపొందిందని టీచర్లు చెబుతున్నారు.

పథకాల రద్దే లక్ష్యం



గత ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి కోసం అమలు చేసిన మంచి పథకాలను రద్దు చేయడమే లక్ష్యంగా బాబు వ్యవహరిస్తున్నారు. వీలైతే ఈ ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాల కోసం యోచించి పేదలకు మరింతగా విద్యను చేరువ చేయాలి. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను యథాతథంగా కొనసాగించాలి.

– గెడ్డం సుధీర్, వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

భవిష్యత్ అంధకారంలోకి..



ప్రభుత్వం నిర్ణయం వేలాది మంది విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సీబీఎస్ఈ విద్యతో ఎంతో ప్రయోజనం ఉంది. సీబీఎస్ఈ అమలయ్యే పాఠశాలల పర్యవేక్షణ కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వెళ్ళి మరిన్ని కేంద్ర నిధులు వచ్చే అవకాశాన్ని ఈ ప్రభుత్వం కాలదన్నింది.

– కాకి నాని, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

పేదల వ్యతిరేక ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం పేదల వ్యతిరేక ప్రభుత్వమని మరోసారి రుజువు చేసుకుంది. సజావుగా సాగుతున్న విద్యారంగాన్ని నాశనం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ విధానాలున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో సీబీఎస్ఈ విద్యార్థులు 3 నెలల అభ్యసనా కాలన్ని కోల్పోయి తిరిగి కొత్తగా రాష్ట్ర సిలబస్ చదవాల్సిన పరిస్థితి కల్పించారు.

– వైఎస్సీ శివరావు, విద్యార్థి, యువజన నాయకుడు

దళిత నేతల హౌస్ అరెస్టులు



చీకటిమిల్లి మంగరాజు గృహ నిర్బంధం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పోలీసులు గృహనిర్బంధం చేయడం రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు విమర్శించారు. ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు ఏలూరుపాడులో అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించినందుకు క్షమాపణ చెప్పాలని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గత కొన్ని రోజులుగా మాల మహానాడు, అంబేడ్కర్ సంఘాలు నిరసనలు, ర్యాలీలు చేస్తున్నాయి. దీనిపై పోలీస్ డిపార్ట్‌మెంట్ పట్టించుకోకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా చలో కాళ్ళ పోలీస్‌స్టేషన్‌కు పిలుపునిచ్చారు. అయితే పోలీసులు మంగరాజును హౌస్ అరెస్టు చేశారు. దీనిపై మంగరాజు మాట్లాడుతూ రఘురామను అరెస్టు చేయకుంటే ఆయన ఇంటిని ముట్టడిస్తామని చెప్పారు.

పొట్ల సురేష్ హౌస్ అరెస్టు

తణుకు అర్బన్: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఆల్ ఇండియా పూలే అంబేడ్కర్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు, న్యాయవాది పొట్ల సురేష్ అన్నారు. చలో ఏలూరుపాడు ఉద్యమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో మంగళవారం సురేష్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అంబేడ్కర్‌ను అవమానించి దళిత వర్గాల మనోభావాలు దెబ్బతీసిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై అట్రాసిటీ కేసు నమోదుచేయాలని దళిత వర్గాలు మొత్తుకుంటున్నా పట్టించుకోకపోగా దళిత నాయకులను అక్రమంగా అరెస్టులు చేయించడం బాధాకరమని ఒక ప్రకటనలో సురేష్ అన్నారు.

బీఎస్సీ హార్టీకల్చర్ కౌన్సెలింగ్




ఎంపికైన విద్యార్థులకు పత్రాలు అందిస్తున్న ఉద్యాన వర్సిటీ వీసీ గోపాల్ తదితరులు

తాడేపల్లిగూడెం: బీఎస్సీ(హానర్స్) హార్టీకల్చర్ డిగ్రీ కోర్సులో చేరడానికి హార్టీ సెట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన వర్సిటీలో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. 255 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 169 మంది హాజరయ్యారు. కౌన్సెలింగ్ ద్వారా విశ్వవిద్యాలయ ప్రభుత్వ ఉద్యాన కళాశాలల్లో 61 సీట్లకు, అఫిలియేటెడ్ కళాశాలల్లో 30 సీట్లకు కౌన్సెలింగ్ జరిగింది. మొదటి పదిమందికి ప్రవేశ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వీసీ గోపాల్ మాట్లాడుతూ ఉద్యాన విద్యకు రాబోయే రోజుల్లో ఎంతో ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు వి.జయప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 5,050 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన శిక్షణా సంస్థలు, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిళ్లలో శిక్షణ నిర్వహిస్తారన్నారు. దరఖాస్తు చేసుకొనే శిక్షణా సంస్థలు కనీసం గత రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్లకు కోచింగ్ ఇచ్చి ఉండాలన్నారు.

నోట్ల నడుమ ధనలక్ష్మిగా..



జంగారెడ్డిగూడెం : గంగానమ్మ అమ్మవారికి రూ.2.30 కోట్లతో అలంకరణ



భీమవరం (ప్రకాశంచౌక్) : భీమవరంలోని త్యాగరాజభవన్‌లో రూ 1.5 కోట్లతో కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ధనలక్ష్మి అలంకరణ

మంగళవారం అమ్మవారిని ధనలక్ష్మిగా నోట్ల కట్టలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో గంగానమ్మ అమ్మవారిని రూ.2.30 కోట్లతో అలంకరించారు. భీమవరంలో రూ.1.5 కోట్లతో కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ధనలక్ష్మి అలంకరణ చేశారు. అలాగే దువ్వ దానేశ్వరి, ఏలూరు పవర్‌పేట రాజ్యలక్ష్మి అమ్మవార్లు శ్రీ మహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చారు.

సిరులొలికించే మహాలక్ష్మిగా..



ఏలూరు(ఆర్.ఆర్.పేట): శ్రీ మహాలక్ష్మిదేవి అలంకరణలో ఏలూరు పవర్‌పేట శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారు



తణుకు కల్చరల్: శ్రీ మహాలక్ష్మి అలంకరణలో దువ్వ దానేశ్వరి అమ్మవారు

క్లుప్తంగా

కాలువలో స్నానానికి దిగి..

గల్లంతైన భవానీ మాలధారుడు



దుర్గాప్రసాద్‌ (ఫైల్‌)

తణుకు: కాలువలో స్నానానికి దిగి భవానీ మాలధారుడు గల్లంతయ్యాడు. తణుకు మండలం తేతలి గ్రామానికి చెందిన కాజా దుర్గాప్రసాద్‌ (23) స్థానికంగా ఇటుకల బట్టీలో కూలీగా పని చేస్తున్నాడు. మూడు నెలల క్రితమే ప్రేమ వివాహం చేసుకున్న అతడు తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ఇటీవల భవానీ మాల ధరించిన దుర్గాప్రసాద్‌ మంగళవారం రాత్రి అత్తిలి కాల్వలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. తణుకు రూరల్‌ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దుర్గాప్రసాద్‌ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం షాపులకు 12వేల దరఖాస్తుల అంచనా



దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎక్సైజ్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ ప్రభుకుమార్‌

జంగారెడ్డిగూడెం: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 319 మద్యం షాపులకు సుమారు 12 వేల వరకు దరఖాస్తులు రావచ్చని అంచనా వేస్తున్నట్లు ఎక్సైజ్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ కేవీ నాగ ప్రభుకుమార్‌ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ఎక్సైజ్‌ స్టేషన్‌లో మద్యం షాపుల దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 9వ తేదీ దరఖాస్తుల స్వీకరణకు చివది తేదీ అని, ఆరోజు సాయంత్రం 5 గంటల వరకు క్యూలో ఉన్న దరఖాస్తుదారులను పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. సోమవారం సాయంత్రం వరకు 3 వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. డీఎస్పీ రవిచంద్ర, ఎక్సైజ్‌ సీఐ కె.శ్రీనిబాబు జంగారెడ్డిగూడెం ఎస్సై షేక్‌ జబీర్‌, ఎక్సైజ్‌ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్‌పై కేసు నమోదు

ముసునూరు: బాలిక కిడ్నాప్‌పై ముసునూరు పోలీస్‌ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై ఎం.చిరంజీవి చెప్పిన వివరాలివి. ఈనెల 6వ తేదీన ఇంట్లోనే ఉన్న యల్లాపురంనకు చెందిన బాలిక (15)ను పెదవేగి మండలం బాపిరాజుగూడెం శివారు రామచంద్రపురంనకు చెందిన నాగులపల్లి ఏసురాజు అనే యువకుడు బలవంతంగా లాక్కెళ్లిపోయాడు. దీనిపై బాలిక నాయనమ్మ ముసునూరు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుతో కిడ్నాప్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

వెలుగురేఖను ఆర్పేశారు

ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడుతోంది. దీనిలో భాగంగా పేదలకు ఎంతో ఉపయోగపడే కంటి వైద్యాన్ని రద్దు చేసేందుకు సైతం వెనుకాడలేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కంటి వైద్యం అందిస్తున్న ముఖ్యమంత్రి ఇ ఐ కేంద్రాల గడువు ముగిసినా రెన్యువల్‌ చేయకుండా వాటిని నిర్వీర్యం చేసేందుకు ఒడిగట్టింది. కాంట్రాక్టు సంస్థ కంటి పరీక్షల సామగ్రిని సైతం తరలించుకుపోయాయి. దీంతో కంటి వైద్యం కోసం పేదవర్గాల వారు ప్రైవేట్‌ ఆస్పత్రులను ఆశ్రయించక తప్పని పరిస్థితి.



ఆకివీడు సీహెచ్‌సీలోని ఐ కేంద్రంలో కళ్లజోళ్లు అందిస్తున్న అధికారులు (ఫైల్‌)



వైద్యపరికరాలను తీసుకువెళ్లిపోవడంతో ఖాళీగా ఉన్న ఐ కేంద్రం

- పేదల వైద్యంపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు
- నెలరోజులుగా నిలిచిన ముఖ్యమంత్రి ఇ ఐ కేంద్రం సేవలు
- ఆస్పత్రుల నుంచి కంటి పరీక్షల సామగ్రి తరలించుకుపోయిన కాంట్రాక్టు సంస్థ
- కంటి వైద్య పరీక్షల కోసం పేదల ఇబ్బందులు
- ప్రైవేట్‌ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి

సాక్షి, భీమవరం: పేదల వైద్యంపై చిన్నచూపు చూస్తున్న కూటమి ప్రభుత్వం వారి వెలుగురేఖను ఆర్పేసింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కంటి వైద్యం అందిస్తున్న ముఖ్యమంత్రి ఇ ఐ కేంద్రం సేవలను నిలిపివేసింది. దీంతో పేదలు కంటి వైద్యం కోసం ప్రైవేట్‌ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఆచంట, ఆకివీడు, భీమవరం, భీమడోలు, దెందులూరు, చింతలపూడి, పోలవరం, పాలకొల్లు, నరసాపురం సీహెచ్‌సీలలో 2018లో ప్రభుత్వం ముఖ్యమంత్రి ఇ ఐ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్‌ సంస్థకు అప్పగించింది. ఆటోమెటిక్‌ రిఫ్రాక్టర్‌ మీటర్‌, కంటి లోపల భాగాలను పరీక్షించే ఫండస్‌ కెమెరాలను ఏర్పాటు చేశారు. కంప్యూటర్‌ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా అవసరమైన వైద్యసాయం, కళ్లజోళ్లు, శస్త్రచికిత్సలు అందించేవారు. ఆయా కేంద్రాల్లో ఒక ఆప్తామాలజీ అసిస్టెంట్‌, ఒక ఎక్విప్‌మెంట్‌ టెస్ట్‌ చేసే సిబ్బంది ఉండేవారు.

ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగన్‌ ప్రభుత్వం

సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. చూపు కొద్దిగా మందగించినా జీవనం కష్టమవుతుంది. బతుకు భారంగా మారుతుంది. పేదల వైద్యానికి పెద్దపీట వేసిన గత జగన్‌ ప్రభుత్వం కంటి వైద్యానికి అధిక ప్రాధాన్యమిచ్చింది. ముఖ్యమంత్రి ఇ ఐ కేంద్రాల నిర్వహణతో పాటు వృద్ధులు, విద్యార్థుల కోసం గ్రామాల్లో, పాఠశాలల్లో నాటి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌ కంటి వెలుగు వైద్య శిబిరాలను నిర్వహిస్తూ వచ్చారు. ముఖ్యమంత్రి ఇ ఐ కేంద్రాల కాంట్రాక్టు సంస్థ మెమోరాండమ్‌ ఆఫ్‌ అండర్‌స్టాండింగ్‌ (ఎంఓయూ) గడువు గతంలో పలుమార్లు ముగియగా గత వైఎస్సార్‌ ప్రభుత్వం రెన్యువల్‌ చేస్తూ వచ్చింది. డీఆర్‌, గ్లకోమా, కాటరాక్ట్‌, మాకులర్‌ డిజనరేషన్‌, హైపర్‌ టెన్సీవ్‌ రెటీనోపతి తదితర వైద్యసేవలను అందించేది. ఇ ఐ కేంద్రాల ద్వారా మొత్తం 2,35,943 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 2,199,37 మందికి రిఫ్రాక్షన్‌ చెక్స్‌, 98,950 మందికి ఫండస్‌ చెక్స్‌, 1,50,656 మందికి కళ్లజోళ్లు అందజేశారు. 884 డీఆర్‌, 626 గ్లకోమా, 140 మాకులర్‌ డిజనరేషన్‌, 14,080 కాటరాక్ట్‌, 76 హైపర్‌టెన్సీవ్‌ రెటినోపతి రోగులను గుర్తించి సంబంధిత వైద్యసేవలు, శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఒక్కో కేంద్రంలో ప్రతిరోజు వందమందికి పైగా రోగులు వచ్చి కంటి వైద్యసేవలను ఉచితంగా పొందేవారు.

ఇప్పటి వరకు సీఎం ఇ ఐ కేంద్రాల్లో అందించిన వైద్యసేవలు

ఐ కేంద్రం	మొత్తం పరీక్షలు	రిఫ్రాక్షన్‌ చెక్స్‌	కళ్లజోళ్లు	ఫండస్‌ చెక్స్‌
ఆచంట	27,970	27,832	18,131	13,831
ఆకివీడు	20,576	20,407	13,688	7,246
భీమడోలు	25,179	21,208	14,020	10,556
భీమవరం	23,944	23,638	17,807	8,899
చింతలపూడి	29,747	25,631	17,625	13,619
దెందులూరు	24,401	22,320	13,499	11,815
పాలకొల్లు	30,553	29,815	21,443	12,491
పోలవరం	25,883	22,420	15,453	9,858
నరసాపురం	27,690	26,666	18,990	10,635

నిలిచిన సేవలు

సెప్టెంబరు 4వ తేదీతో కాంట్రాక్టు సంస్థతో ఉన్న ఎంఓయూ గడువు ముగియగా రెన్యువల్‌ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంతో కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్లలో కొనసాగుతున్న సీఎం ఇ ఐ కేంద్రాల సేవలు నిలిచిపోయాయి. కాంట్రాక్టు సంస్థ ఆస్పత్రుల్లోని ఆటోమెటిక్‌ రిఫ్రాక్టర్‌ మీటర్‌, ఫండస్‌ కెమెరాలు, ఇతర సామగ్రిని తరలించుకుపోయింది. సేవలు అందిస్తుండగానే ఆటోమేటిక్‌గా రెన్యువల్‌ చేయాల్సి ఉండగా కూటమి ప్రభుత్వం అందుకు చొరవ చూపకపోవడం పేదవర్గాల వారి పాలిట శాపంగా మారింది. దీంతో వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేటు ఆసుపత్రిల్లో కంటి వైద్యం చేయించుకోవాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇ ఐ కేంద్రాలను మళ్లీ ఎప్పుడు తెరిచేది ప్రభుత్వం నుంచి స్పష్టత లేదని సంబంధిత అధికారులు అంటున్నారు. పేదవర్గాల వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉన్న ఈ ఉచిత కంటి వైద్య పరీక్షల నిర్వహణకు కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యావరణానికి పెనుముప్పుగా ప్లాస్టిక్‌

నిట్‌లో నేషనల్‌ వెబినార్‌



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్‌ దినేష్‌ రెడ్డి

తాడేపల్లిగూడెం: ప్లాస్టిక్‌ విషపూరితమైనదని, పర్యావరణానికి పెనుముప్పుగా మారిందని ఇండియన్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ కెమికల్‌ ఇంజనీర్స్‌ ఉపాధ్యక్షురాలు డాక్టర్‌ షీలా అన్నారు. ఇండియన్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ కెమికల్‌ ఇంజనీర్స్‌ అమరావతి రీజనల్‌ సెంటర్‌ (గుంటూరు) ఏపీ నిట్‌ స్టూడెంట్‌ చాప్టర్స్‌ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఎకానమీ అప్రోచ్‌ ఫర్‌ మిటిగేషన్‌ ఆఫ్‌ ప్లాస్టిక్‌ వేస్ట్‌ అనే అంశంపై ఆఫ్‌లైన్‌, ఆన్‌లైన్‌ పద్ధతిలో నేషనల్‌ వెబినార్‌ జరిగింది. ఆన్‌లైన్‌లో కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్‌ షీలా మాట్లాడుతూ సముద్రాలు, నదులు, కాలువలు, డ్రెయిన్‌లలో ప్లాస్టిక్‌ వ్యర్థాలు కలిసి నీటిని కలుషితం చేయడం వల్ల మానవాళి, పశుపక్ష్యాదులు, జలచరాలు తీవ్రముప్పును ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ రహిత సమాజానికి కృషి చేయాలన్నారు. ఐఐసీహెచ్‌ఈ హానరరీ రిజిస్ట్రార్‌ డాక్టర్‌ దవళ్‌ సక్సేనా, కోశాధికారి డాక్టర్‌ ఎస్‌.బాలసుబ్రమనియన్‌, డైరెక్టర్‌ సర్క్యులర్‌ ఎకానమీ అండ్‌ వేస్ట్‌ మేనేజ్‌మెంట్‌ డివిజన్‌, ద ఎనర్జీ అండ్‌ రీసోర్స్‌ ఇనిస్టిట్యూట్‌కు చెందిన డాక్టర్‌ సునీల్‌ పాండే మాట్లాడుతూ పేపర్‌, క్లాత్‌ సంచుల వినియోగంపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ప్లాస్టిక్‌ వ్యర్థాలు భూమిలో చేరి, నేల భూసారాన్ని అడ్డుకుంటుందని, ప్లాస్టిక్‌ వ్యర్థాలను రీసైక్లింగ్‌ చేయడం ద్వారా వ్యర్థాలను కొంతవరకు నివారించవచ్చని వివిధ సంస్థలకు చెందిన వక్తలు పి.ప్రకాష్‌, సనత్‌కుమార్‌, వీరేంద్రకుమార్‌ గుప్తా అన్నారు. కెమికల్‌ ఇంజనీరింగ్‌ విభాగానికి చెందిన మ్యాగజైన్‌ను రిజిస్ట్రార్‌ ఆవిష్కరించారు. కెమికల్‌ ఇంజనీరింగ్‌ విభాగాధిపతి డాక్టర్‌ వినోద్‌కుమార్‌రాజా, ఆచార్యులు జి.చక్రబోర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

కమిటీని ఎవరు నియమించారో?

- నేటివరకు శ్రీ మహిషమ్మ ఉత్సవ కమిటీ నియామకంపై అందని ఉత్తర్వులు
- సభ్యులుగా చెబుతున్న కూటమి నేతలకు సన్మానాలు, సమావేశాలు
- ఈఓ తీరుపై విస్తుపోతున్న భక్తులు, రాజకీయ పక్షాలు



ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులంటూ సన్మానం చేసిన దేవాదాయశాఖ సిబ్బంది

నూజివీడు: పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ కోట మహిషాసురమర్దిని అమ్మవారి ఆలయానికి ఉత్సవ కమిటీ నియామకం జరగకుండానే కొందరు కూటమి నాయకులు, కార్యకర్తలు తమకు తామే ఉత్సవ కమిటీ సభ్యులుగా పేర్కొనడం, దానికి ఆలయ ఈఓ అలివేణి శ్రీ నాగలక్ష్మీదేవి తందాన అనడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏటా దసరా ఉత్సవాల సందర్భంగా ఆలయంలో సేవ చేసేందుకు గాను ఆసక్తి ఉన్న వారిని ఉత్సవ కమిటీగా నియమించడం జరుగుతోంది. ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో ఈ కమిటీ సభ్యులు అక్కడే ఉండి భక్తులను క్యూలో నిల్చోబెట్టడం, ప్రసాదం పంపిణీ చేయడం, గుడిలో రద్దీ వల్ల తోపులాటలు జరగకుండా చూడటం వంటివి చేస్తూ ఉంటారు. అయితే నేటివరకు దేవాదాయ కమిషనర్‌ నుంచి ఉత్తర్వులు రాకుండానే ఉత్సవ కమిటీ సభ్యులమని తమకు తామే చెప్పుకుంటున్నారు. దీనికి ఈవో కూడా వారికి వంతపాడుతూ వారికి ఆలయంలో సన్మానం చేయడంతో పాటు, విజయదశమి రోజున నిర్వహించే కార్యక్రమాలు, ఉత్సవాలను నిర్వహించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పోలీసు అధికారులు సైతం వారితో సమావేశాలు నిర్వహించడాన్ని చూసి రాజకీయపక్షాలు, భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నేటివరకు వెలువడని ఉత్సవ కమిటీ నియామక ఉత్తర్వులు

శ్రీ కోటమహిషాసురమర్దిని అమ్మవారి ఆలయంలో నిర్వహించే దసరా ఉత్సవాలకు 15 మంది సభ్యులతో కూడిన ఉత్సవ కమిటీని ఈనెల 2వ తేదీ నుంచి 12వ తేదీ వరకు కాలపరిమితితో నియమించమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి దేవాదాయశాఖ కమిషనర్‌కు ఈనెల ఒకటో తేదీన సిఫార్సు లేఖ రాశారు. అయితే దానికి సంబంధించి ఇంతవరకు దేవాదాయశాఖ కమిషనర్‌ నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. నియామక ఉత్తర్వుల గురించి ఈఓను అడిగితే ఫలానా నాయకుడి వద్ద ఉందంటూ దాటవేత సమాధానం చెబుతున్నారు. నిజంగా నియమిస్తే కచ్చితంగా దేవాదాయశాఖ కమిషనర్‌ నుంచి ఉత్తర్వుల కాపీ ఆలయ ఈఓకు వస్తుంది. ఈఓ మాత్రం తనకు రాలేదంటూ సమాధానం చెప్పడం గమనార్హం.

పాడి పశువుల్లో ఉత్పాదక శక్తిని పెంచాలి

పెంటపాడు: పాడి పశువుల్లో ఉత్పాదక శక్తిని మరింత పెంచేలా పశువైద్యులు కృషి చేయాలని రాష్ట్ర పశుసంవర్థక శాఖ అదనపు సంచాలకులు, డాక్టర్‌ సత్యకుమారి పేర్కొన్నారు. పెంటపాడులోని పశుగణాభివృద్ధి జిల్లా రైతు శిక్షణ మందిరంలో ఉమ్మడి జిల్లా పశువైద్య అధికారులతో ఆమె మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యకుమారి మట్లాడుతూ పశువుల్లో లింగ నిర్ధారిత, వీర్య నాళికల గురించి రైతులకు డాక్టర్లు అవగాహన కల్పించాలన్నారు. లింగ నిర్ధారిత శాస్త్ర పరిజ్ఞానం రైతులకు చేరవేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పిండ మార్పిడి విధానం ద్వారా రైతులు ఎంతో మేలు పొందుతారన్నారు. ఇప్పటికే సెక్సర్‌సెమన్‌ ద్వారా ఆడదూడలు పుట్టిన సంగతిని రైతులకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా వైద్యులు తీసుకోవాల్సిన చర్యలు, నిర్దేశిత లక్ష్యాలు ఆమె సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో జేసురత్నం, జిల్లా పశువైద్య సంచాలకులు మురళీకృష్ణ, డీడీ సుధాకర్‌, ఆయా ప్రాంతాల డీడీలు, ఏడీఏలు, వెటర్నరీ లైవ్‌స్టాక్‌ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణకిరీటం, కరెన్సీ కట్టలతో గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

స్వర్ణకిరీటం, కరెన్సీ కట్టలతో దుర్గామాతకు అలంకరణ

నిడమర్రు: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నిడమర్రు మండలంలోని మందలపర్రు గ్రామంలో పంచాయతన క్షేత్రం శ్రీ ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలోని దుర్గామాత మంగళవారం ధనలక్ష్మిగా పూజలందుకొంది. ఈ సందర్భంగా నూతన స్వర్ణకిరీటంతోపాటు, రూ.50 లక్షలు విలువైన కరెన్సీ నోట్ల కట్టలు, 11 రకాల స్వీట్ల సారెతో భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత గ్రామ దేవత జమ్ములమ్మ ఆలయం వద్ద చలివిడి పానకాలు సమర్పించారు. ఊరేగింపు అనంతరం దుర్గమ్మకు స్వర్ణ కిరీటాన్ని అలంకరించి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికి అమ్మవారి సారెగా 11 రకాల స్వీట్లను పంపిణీ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గాదిరాజు వెంకట సుబ్బరాజు, శకరం, సుబ్బరాజు కృష్ణంరాజు, రామచంద్రరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.





సాక్షి క్లాసిఫైడ్స్‌

Real Estate

ఇల్లు అమ్మబడును

■ భీమవరంలో శ్రీనివాసా థియేటర్‌ వెనుక బండారు అప్పారావు గారి వీధిలో దక్షిణం ఫేసింగ్‌ 4 సెంట్ల 15 గజాల డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇల్లు అమ్మకం. కాంటాక్ట్‌ : 93985 08524 [P-193059]

Wanted

■ ప్రముఖ కంపెనీలో వర్క్‌ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్‌ వాట్సప్‌ చేయగలరు. వర్క్‌ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1185465]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు,RMP&డాక్టర్స్‌ కావలెను.జీ: 15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.HYD.8317512135 [HA-98651]

Services

■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం, తక్కువ వడ్డీ రేటు, సిబిల్‌ అవసరం లేదు. NPA కూడ దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్‌ కావలెను.అర్చన్‌ఫైనాన్స్‌,పార్టిబా. 8500236824. [T-282]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



కన్నవారి రుణం తీర్చుకున్నావమ్మా..



తండ్రికి అంత్యక్రియలు నిర్వహించిన కుమార్తె

పాలకొల్లు సెంట్రల్‌: జన్మనిచ్చిన తల్లిదండ్రుల రుణం తీర్చుకుంది ఓ కూతురు. పాలకొల్లు పట్టణంలోని 22వ వార్డు కొత్తపేట ప్రాంతానికి చెందిన యర్రంశెట్టి చైతన్య సాఫ్ట్‌వేర్‌ ఇంజనీర్‌. వృత్తిరీత్యా ఆమె హైదరాబాద్‌లో ఉంటున్నారు. గతేడాది డిసెంబర్‌ 31న తల్లి పుణ్యవతిదేవి మృతి చెందగా బంధువులు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో చైతన్య తలకొరివి పెట్టింది. ఆమె తండ్రి బాపయ్యనాయుడు (70) గత కొన్నేళ్లుగా మంచానికే పరిమితమై ఉన్నారు. ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్న ఆమె తండ్రిని చూసుకోవడానికి ఒక మనిషిని ఏర్పాటుచేసి నిత్యం తండ్రి యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. గత ఆదివారం తండ్రి ఆరోగ్యం మరీ క్షీణించడంతో స్థానికుల సహకారంతో పట్టణంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. సోమవారం పాలకొల్లు వచ్చిన ఆమె ఆసుపత్రిలో ఉన్న తండ్రిని చూసుకుంటుంది. వారం రోజులుగా చికిత్స పొందుతున్న బాపయ్యనాయుడు మంగళవారం మృతి చెందాడు. తలకొరివి పెట్టడానికి బంధువులు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో తల్లికి చేసినట్లుగానే తండ్రికి కూడా చైతన్య అంత్యక్రియలు నిర్వహించి కన్నవారి రుణం తీర్చుకుంది.

రాష్ట్రస్థాయి టెన్నిస్‌ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న రూరల్‌ సీఐ శ్రీనివాస్‌

పాలకొల్లు సెంట్రల్‌: స్థానిక కాస్మో కల్చరల్‌ స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌, టౌన్‌హాల్‌ సంయుక్త ఆధ్వర్యంలో రుద్రరాజు పద్మరాజు మెమోరియల్‌ రాష్ట్ర స్థాయి టెన్నిస్‌ పోటీలను మంగళవారం రూరల్‌ సీఐ గుత్తుల శ్రీనివాస్‌ ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో అండర్‌ 8, 10, 12, 14 విభాగంలో బాలబాలికలకు సింగిల్‌, డబుల్స్‌ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి రోజు 40 గేమ్‌లు జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. కాస్మో క్లబ్‌, టౌన్‌హాలులో ఈ పోటీలు నిర్వహించారు.

పండుగల వేళ.. పసిడి పరుగులు

- తగ్గిన అమ్మకాలు
- ఉమ్మడి పశ్చిమలో రోజుకు రూ.2 కోట్ల వరకు అమ్మకాలు డౌన్‌
- అన్ని పట్టణాల్లో పాత బంగారం మార్పిడి జోష్‌
- రూ. లక్ష లోపే కిలో వెండి



నరసాపురంలో ఓ జ్యూయలరీ షాపు

నరసాపురం: కేంద్ర బడ్జెట్‌లో బంగారంపై దిగుమతి సుంకాన్ని 9 శాతం తగ్గిస్తున్నట్టు ప్రకటించగానే బంగారం ధరలు భారీగా పతనమయ్యాయి. అయితే ఆ ఆనందం బంగారం ప్రియులకు ఎంతోకాలం నిలువలేదు. గత కొన్ని రోజులుగా బంగారం ధరలు మళ్లీ ఆకాశానికి చేరి కూర్చున్నాయి. ఓవైపు షేర్‌ మార్కెట్‌ ఒడిదుడుకుల్లో కొనసాగుతోంది. అంతర్జాతీయంగా క్రూడ్‌ ఆయిల్‌ ధరలు పెరుగుతున్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.84 వద్ద కొనసాగుతోంది. దీంతో బంగారం ధరలు పెరగడమే కానీ ఇప్పటిలో తగ్గే అవకాశం కనిపించడం లేదు. ప్రస్తుతం బంగారం ధరలు ఆల్‌టైం హైలో కొనసాగుతున్నాయి. ఈ ప్రభావం అమ్మకాలపై పడింది. మంగళవారం నరసాపురం బులియన్‌ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.78,200 వద్ద ట్రేడయ్యింది. 22 క్యారెట్ల 916 బంగారం ధర రూ.71,180కు చేరింది. అంటే కాసు ఆభరణాల బంగారం ధర రూ.56,944కు చేరింది. కాసు బంగారు వస్తువులు చేయించుకోవాలంటే తరుగు, మజూరీలను కలుపుకొని రూ. 65 వేలు పెట్టాలి. బంగారం జోరు ఇదే విధంగా కొనసాగితే కొన్ని రోజుల వ్యవధిలోనే రూ.80 వేల మార్కును కూడా దాటేస్తుందని అంచనా వేస్తున్నారు.

అంచనాలు తలకిందులు చేస్తూ..

బడ్జెట్‌ ప్రకటన తరువాత నిలకడగా ఉన్న బంగారం ధరలు ఇంకా తగ్గుతాయని బులియన్‌ వర్గాలు విశ్లేసిస్తూ వచ్చారు. అయితే అందరి అంచనాలనూ తలకిందులు చేస్తూ బంగారం ధరలు మళ్లీ కొండెక్కి కూర్చున్నాయి. మరో వైపు వెండి ధర మాత్రం కాస్త తగ్గింది. మూడునెలల క్రితం కిలోవెండి రూ.లక్ష మార్కు దాటి రికార్డు సృష్టించింది. ప్రస్తుతం వెండి కిలో రూ.93 వేల వద్ద ట్రేడవుతోంది.

పండుగల అమ్మకాలపై ప్రభావం

దసరా, దీపావళి పండుగల రోజుల్లో బంగారం అమ్మకాలు జోరుగా సాగుతాయి. ఇక క్రిస్మస్‌, సంక్రాంతి పండుగలు కూడా సమీపానే ఉన్నాయి. మరోవైపు పెళ్లిళ్ల సీజన్‌ కూడా మొదలయ్యింది. అయితే బంగారం ధర పెరుగుదల అమ్మకాలపై ప్రభావం చూపింది. మొన్నటి వరకూ కళకళలాడిన జ్యూయలరీ షాపులు ప్రస్తుత సీజన్‌లో కూడా వెలవెలబోతున్నాయి. ఒక్క నరసాపురం మార్కెట్‌లోనే హోల్‌సేల్‌, రిటైల్‌ కలిపి రోజుకు రూ. 4 కోట్ల వరకు బంగారం అమ్మకాలు జరుగుతాయి. ఉమ్మడి పశ్చిమలోని ఏలూరు, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం పట్టణాల్లో పెద్దెత్తున అమ్మకాలు జరుగుతాయి. పెరిగిన ధరలతో జిల్లాలో రోజుకు రూ.2 కోట్ల వరకూ అమ్మకాలు తగ్గినట్టుగా అంచనా. దాదాపు 30 శాతం అమ్మకాలు తగ్గిపోయాయని బులియన్‌ వర్తకులు చెప్తున్నారు.

పాత బంగారం మార్పిడిపై ఆసక్తి

ధరలు దారుణంగా పెరగడంతో ఆభరణాల అమ్మకాలు పడిపోయాయి. పెళ్లిళ్ల వంటి సామాజిక అవసరాలకు బంగారం కొనేవారు కూడా వాయిదాలు వేసుకుంటున్నారు. పెట్టుబడిగా కొనే బిస్కెట్‌ అమ్మకాలు మాత్రం కాస్త బాగానే సాగుతున్నాయని చెపుతున్నారు. ఇక పాత బంగారం మార్పిడి జోష్‌ అన్ని పట్టణాల్లో కొనసాగుతోంది. ధర రూ.78 వేలకు చేరడంతో పాత బంగారం మార్పిడికి ఇదే అనుకూల సమయంగా కొనుగోలుదారులు భావిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న అమ్మకాల్లో 50 శాతం వాటా పాత బంగారం మార్పిడితోనే జరుగుతోంది.

అంచనా వేయలేకపోతున్నాం



బంగారం ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. కేంద్ర బడ్జెట్‌లో బంగారం దిగుమతి సుంకం 9 శాతం తగ్గించినా ఆ ప్రభావం రెండు నెలలు మాత్రమే కనిపించింది. ఏది ఏమైనా బంగారం ధరలను అంచనా వేయలేకపోతున్నాం. ప్రస్తుతం అయితే అమ్మకాలు బాగా తగ్గాయి. దాదాపు 30 శాతం అమ్మకాలు తగ్గాయి. లిక్విడ్‌ క్యాష్‌తో ఎవరూ బంగారం కొనుగోళ్లు చేయడంలేదు. పాత బంగారం మార్చుకుని కొత్త వస్తువులు ఆర్డర్లు ఇస్తున్నారు. ప్రస్తుతం ఇదే వ్యాపారం ఎక్కువగా సాగుతోంది. ధరలు పెరగడంతో రెండు కాసులు కొనేవారు కాసు, మూడు కాసులు కొనేవారు రెండు కాసులు కొంటున్నారు.

–వినోద్‌కుమార్‌ జైన్‌, నరసాపురం బులియన్‌ మర్చంట్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు

క్లుప్తంగా

అమ్మవారి ఆశీస్సులు ప్రజలకు కలగాలి



తాడేపల్లిగూడెంలో బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికి కలగాలని మాజీ ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని బ్రహ్మానంద రెడ్డి మార్కెట్ పండ్ల వర్తక సంఘం, వార్ఫ్ రోడ్డు ధాన్యం వ్యాపారస్తులు ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవార్లను మాజీ మంత్రి కొట్టు మంగళవారం రాత్రి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గత 47 సంవత్సరాల నుంచి నిరంతరాయంగా అమ్మవారి ఉత్సవాలను నిర్వహించడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో నిరాటంకంగా ఉత్సవాలు కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, కైగాల శ్రీనివాస్, కోడే అప్పారావు, షేక్ నౌషద్, పైడిపాల సత్యనారాయణ, బొద్దాని శ్రీనివాస్, గోకా వెంకటరత్నం పాల్గొన్నారు.

36 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు



తణుకులో ఉచిత వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 36 మంది వైద్యసేవలు పొందారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వృద్ధులకు వైద్యసేవలందించి ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. అనంతరం సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సజ్జాపురం శాఖ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు కాయల నాగేశ్వరరావు, ద్వారంపూడి బాలిరెడ్డి, ఇవటూరి లక్ష్మణరావు, సాధు పాల్గొన్నారు.

కీటకజనిత వ్యాధులను నియంత్రించండి



ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న హెల్త్ అధికారి లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కీటకజనిత వ్యాధులను నియంత్రించాలని సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లలో మంగళవారం ఆశాడేను నిర్వహించారు. హెల్త్ సిబ్బందికి పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులను నియంత్రించడంలో వెక్టార్ కంట్రోల్ హైజీన్ అప్లికేషన్ ద్వారా సచివాలయం పరిధిలో అపరిశుభ్రత విషయాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కీటక జనిత ప్రదేశాలను నిలువరించాలని, దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు మంగతాయరు, పద్మ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశాలు, ఆరోగ్య కార్యదర్శులు ఆరోగ్య సహాయకులు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో సామాజిక వెలి ?

తాడేపల్లిగూడెం రూరల్: ఒకే సామాజికవర్గానికి చెందిన వారు అదే సామాజికవర్గానికి చెందిన ఒక కుటుంబంతో మాట్లాడకపోవడం, శుభ, అశుభకార్యాలలో పాల్గొనకుండా సామాజిక వెలి చేసిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని పాత ఎస్సీ పేటలో నివాసముంటున్న తమను స్థానికులు వెలి వేశారని గెద్దం కాంతమ్మ, గెద్దం ధనలక్ష్మి ఆరోపించారు. ఇంటి దారిని, వాడకం నీరు వెళ్లే డ్రెయినేజీని సైతం మూసివేశారని వాపోయారు. స్థానికులను నిలదీస్తే దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే, ఈ సంఘటనపై తహసీల్దార్ సునీల్‌కుమార్ త్వరలో విచారణ చేయనున్నట్టు తెలిసింది.

లక్కీ డిప్ కలిసొచ్చేనా?

- ఇప్పటి వరకు 33 షాపులకు 400 దరఖాస్తులు
- నేటి సాయంత్రం 5 గంటల వరకు గడువు
- 500 పైగా దరఖాస్తులు వస్తాయని అంచనా



తణుకు ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీను పరిశీలిస్తున్న సీఐ మణికంఠరెడ్డి

తణుకు: ఏ ప్రభుత్వమైనా విజయదశమికి ప్రజాప్రయోజన పథకానికి నాంది పలుకుతుంది. అయితే కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చేలా చేస్తోంది. ఎక్కడో ఊరికి దూరంగా అక్కడక్కడా ఉన్న మద్యం షాపులు పట్టణంలోకి ప్రజల మధ్యకు అందుబాటులోకి రానున్నాయి. దీంతో తాగినోళ్లకు తాగినంత మద్యం అందించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగానే నూతన మద్యం పాలసీకి నాంది పలికింది. మద్యం దుకాణాలను ప్రభుత్వం నుంచి ప్రైవేటుకు కట్టబెడుతూ నిర్ణయం తీసుకుంది. ఈనెల 12వ తేదీ నుంచి మద్యం దుకాణాలు తెరుచుకోనున్నాయి. తణుకు ఎక్సైజ్ పరిధిలో 33 మద్యం షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. 11న భీమవరంలోని జిల్లా కలెక్టర్ సమక్షంలో ఉదయం 8 గంటల నుంచి లాటరీ తీస్తారు. 12న విజయదశమి కానుకగా దుకాణాల్లో మద్యం అమ్మకాలు సాగనున్నాయి. మంగళవారం రాత్రి వరకు మొత్తం 33 షాపులకు గాను 400 వరకు దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. గడువు పూర్తయ్యే సరికి 500 పైగా దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే తణుకు ఎక్సైజ్ స్టేషన్ వద్ద భారీ ఎల్‌ఈడీ ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారులకు సమాచారం అందించేందుకు వీలుగా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

భయపెట్టే లైసెన్స్ ఫీజులు

లాటరీలో అదృష్టం ఉండి మద్యం దుకాణం వస్తే తణుకు ఎక్సైజ్ స్టేషన్ తణుకు మున్సిపాలిటీతో పాటు తణుకు, ఇరగవరం, పెనుగొండ, పెనుమంట్ర మండలాల్లో రూ.65 లక్షలు లైసెన్సు ఫీజు చెల్లించాల్సిందే. రూ. 2 లక్షలు దరఖాస్తు ఫీజుతో పాటు ఈ డబ్బులు కూడా దుకాణదారుడు చెల్లించాలి. ఇంతగా వెచ్చించి షాపు పెడితే వ్యాపారం జరిగి అంత లాభం వస్తుందా, లాభాలు రాకుంటే సిండికేట్‌కు అవకాశం ఉందా? అలా కాకపోతే పెట్టిన డబ్బుల పరిస్థితి ఏంటి అనే సంశయం టెండర్ వేయాలనుకున్న వారి మదిలో మెదలుతోంది. లాటరీ టికెట్ కొంటే అదృష్టవశాత్తు డబ్బులు వస్తే వస్తుంది లేకుంటే లాటరీ టికెట్ కొన్న డబ్బులు వృథాగానే పోతుంది. అలా మద్యం షాపుల్లో అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు కొనాల్సిన టికెట్ (దరఖాస్తు) ధర రూ.2 లక్షలు. షాపు కావాలని కోరుకునే వారు ఇంత మొత్తాన్ని లాటరీకి పెట్టి పరీక్షించుకోవాల్సిందే. డిప్‌లో షాపు రాకుంటే రూ. 2 లక్షలు వదులుకోవాల్సిందే.

క్షుణ్ణంగా దరఖాస్తుల పరిశీలన



మద్యం షాపుల కోసం వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. డీడీలను సైతం నిశితంగా పరిశీలించి దరఖాస్తుదారుల అనుమానాలు నివృత్తి చేస్తున్నాం. 33 షాపులకు గాను మంగళవారం రాత్రి వరకు 400 వరకు దరఖాస్తులు వచ్చాయి. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు గేటు లోపల ఉండే దరఖాస్తుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తాం. సమాచారం అందించేందుకు వీలుగా ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశాం.

– సత్తి మణికంఠరెడ్డి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ, తణుకు

రూ. 99తో నాణ్యమైన మద్యం సాధ్యమా?

కేవలం రూ. 99కే నాణ్యమైన బ్రాండెడ్ మద్యం సరఫరా చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న మాటలపై సామాన్యుడికి నమ్మకం కలగడం లేదు. మద్యం దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేసేయడానికే రూ. 2 లక్షలు నాన్ రిఫండబుల్ రుసుం వసూలు చేస్తోంది. తర్వాత ఏడాదికి కనీస రుసుం రూ. 65 లక్షలు నిర్ధారించింది. ఇక దుకాణాల అద్దెలు, అడ్వాన్సులు మొత్తం కలిపి వ్యాపారస్తులకు తడిచిమోపెడవుతుంది. ఇంతపెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టిన వ్యాపారులకు ప్రభుత్వం ఇచ్చే మార్జిన్ కేవలం 20 శాతం మాత్రమే. అంటే రూ. 99కు ఒక క్వార్టర్ మద్యం విక్రయిస్తే వారికి వచ్చేది కేవలం రూ. 20 మాత్రమే. అంటే ప్రభుత్వం చెబుతున్న నాణ్యమైన మద్యం అనేది కేవలం గారడీ మాత్రమే అని పలువురు విశ్లేషిస్తున్నారు.

సాధారణ పరిపాలనపై శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు రెండు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్ సాధారణ కనీస పరిపాలన విధానంలో పది అంశాలపై, 2024–25 ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళికపై శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రవిచంద్ర, జడ్డు ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల విధులు, బాధ్యతలపై అవగాహన

తణుకు టౌన్: గ్రామాల అభివృద్ధిలో ఉప సర్పంచ్‌లు, సభ్యులు సహకారం చాలా అవసరమని ఎంపీడీవో ఆర్ లోహిత్ జయసాగర్ చెప్పారు. మంగళవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో రెండురోజులు పాటు గ్రామ ఉప సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామ పాలనలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాత్ర గురించి సభ్యులకు వివరించారు.

బౌద్ధపీఠం నిర్మాణానికి విరాళం

పెంటపాడు: మండలంలోని ఉంద్రాజవరంలో రూ. 4 కోట్లతో నిర్మించబోయే బౌద్ధ పీఠం నిర్మాణానికి అలంపురంకు చెందిన టీబీఆర్ సంస్థల అధినేత తనుబుద్ధి భోగేశ్వరరావు రూ. 1 లక్ష చెక్కును మంగళవారం అందజేశారు.

ఎవరూ అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



యానాలపల్లి గ్రామంలో తాడి చంద్రరావును పరామర్శిస్తున్న వద్ది రఘురాం

పెంటపాడు: రాష్ట్రంలో కార్యకర్తల ఐక్యత, వారి సంక్షేమమే వైఎస్సార్ సీపీకి ఎనలేని అండ అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు వద్ది రఘురాం నాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని యానాలపల్లి గ్రామాన్ని సందర్శించారు. అక్కడ కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఇటీవల అనారోగ్యం నుంచి కోలుకొన్న తాడి చంద్రరావును ఆయన పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం అండగా ఉంటారన్నారు. ఎవరూ అధైర్యపడవద్దన్నారు. రాబోయే రోజులలో అందరం కలిసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసి, సంక్షేమాన్ని, అభివృద్ధిని సాధిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో గూడెం జెడ్పీటీసీ సభ్యులు ముత్యాల ఆంజనేయులు, కొప్పు వెలమ రాష్ట్ర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీను, నల్లమిల్లి విజయానందరెడ్డి, పోసిన శ్రీను, మాకరాజు సతీష్, యానాలపల్లి మాజీ సర్పంచ్ తాడి కృష్ణ, తాడి భాస్కరరావు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో బలమైన ఉద్యమాలను నిర్మించాలి



ఇటుకులగుంట గ్రామంలో సీపీఎం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: సీపీఎం పార్టీ రానున్న కాలంలో గ్రామాల్లో బలమైన ఉద్యమాలు నిర్మించి, పార్టీని అభివృద్ధి చేయాలని కార్యకర్తలకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఇటుకులగుంట గ్రామంలో పార్టీ గ్రామ శాఖ ఏడవ మహాసభ మాగంటి చింతారావు అధ్యక్షతన జరిగింది. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బాబూరావు మాట్లాడారు. గ్రామ శాఖ కార్యదర్శి పాలుపూరి సత్యనారాయణ గత నాలుగేళ్ల కార్యకలాపాల నివేదికను సమర్పించారు. అనంతరం నూతన కార్యదరిశగా పాలుపూరి సత్యవతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల నాయకులు కండెల్లి సోమరాజు, సభ్యులు కే.లక్ష్మి, మల్లిపూడి సీతామహాలక్ష్మి, భవాని, మాగంటి వెంకటరమణ, పాలుపూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐఆర్‌డీపై ధ్వజమెత్తిన ఎల్‌ఐసీ ఏజెంట్లు



తణుకు ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎల్‌ఐసీ ఏజెంట్లు

తణుకు అర్బన్: దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకలా నిలబడుతున్న ఎల్‌ఐసీని ఐఆర్‌డీఏ నిర్వీర్యం చేస్తుందంటూ ఎల్‌ఐసీ ఏజెంట్లు తణుకు బ్రాంచ్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏజెంట్లు మాట్లాడుతూ ఐఆర్‌డీఏ ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలను ప్రోత్సహించేలా సంకుచిత నిర్ణయాలు తీసుకుని ఎల్‌ఐసీని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. కనీస పాలసీని రూ. 2లక్షలకు పెంచడంతో పాటు 50 సంవత్సరాలు నిండిన వారికి పాలసీ ఇచ్చే విధానంలో మార్పులు చేయడం, ఏజెంట్ల కమిషన్‌ను సైతం తగ్గించిందని దుయ్యబట్టారు. డిజిటలైజేషన్ పేరుతో చిన్నస్థాయి ఏజెంట్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. లోన్లపై వడ్డీని తగ్గించాలని, పేపర్‌లెస్ విధానాన్ని విరమించుకోవాలని, జీవిత బీమా రంగాన్ని జీఎస్టీ నుంచి, ఎల్‌ఐసీ ప్రీమియంను ఆదాయ పన్ను నుంచి మినహాయించాలని, రూ.5లక్షలు దాటి ఉన్న పాలసీలపై వచ్చే ఆదాయానికి పన్ను ఉపసంహరించుకోవాలన్నారు. జీవిత బీమా రంగంలో ఎఫ్‌డీఐని 74 శాతానికి పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. యూనియన్స్‌కు అతీతంగా ఏజెంట్స్ అందరూ పాల్గొన్నారు.

ఆసుపత్రి అవసరాలను గుర్తించాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఆసుపత్రి అవసరాలను గుర్తించి, తనకు తెలియజేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వెంకట్రామన్నగూడెం, మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ శస్త్ర చికిత్సల్లో అనుకోని సంఘటనలు జరిగి వికటిస్తే దానికి వైద్యులను నిందించకుండా వారికి బాసటగా నిలవాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో ఉత్సాహవంతులు ముందుకొస్తే వారిని నియమిస్తామన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు దాతలు సైతం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రి అభివృద్ధికి గ్రామ నాయకులు రూ.11వేలు విరాళంగా అందజేశారు. ఎంపీపీ పానుకుమాటి శేషలత, సర్పంచ్ నాగ అంజూష, మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్, తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, వైద్యులు శ్రీహర్ష, వీర వెంకటేష్,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జగజ్జననీ పాహిమాం



తణుకు టౌన్ వేల్పూరు ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో

తణుకు టౌన్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పలు ఆలయాల్లో మంగళవారం వేర్వేరు రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. దువ్వ గ్రామంలో శ్రీ దానేశ్వరి అమ్మవారిని మహాలక్ష్మి అమ్మవారిగా అలంకరించి ప్రత్యేక పూత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ, సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. వేల్పూరు గ్రామంలోని శరన్నవరాత్రి వేడుకలు సందర్భంగా గ్రామ ఆర్యవైశ్య సేవా సంఘం భవన్‌లో ఆరో రోజు అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారిగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని రూ. 6 లక్షల నోట్లతో అలంకరించి పూజలు నిర్వహించారు.

వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు


తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను ఆరోరోజు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారకు ప్రత్యేక పూజలు చేశారు.

దుర్గమ్మకు రూ.5 లక్షల కరెన్సీ అలంకరణ

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులోని కనకదుర్గమ్మను మంగళవారం మహాలక్ష్మిదేవిగా అలంకరించారు. ఆలయ అధ్యక్షుడు బడేటి ఉదయభాను ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కృషి చేసారు.



పెంటపాడు:మహాలక్ష్మీ అవతారంలో కాగులంపాడు దుర్గమ్మ



తాడేపల్లిగూడెం(టీఓసీ): ధనలక్ష్మిదేవిగా శ్రీవాసవి అమ్మవారు

వ్యవసాయ సంక్షోభాన్ని ప్రభుత్వాలు నివారించాలి

పెంటపాడు: రాష్ట్రంతో పాటు, దేశంలో నెలకొన్న వ్యవసాయ సంక్షోభాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం నివారించాలని ఏపీ రైతు సంఘ జిల్లా కమిటీ కోరింది. ఈ సందర్భంగా మంగళవారం పెంటపాడులోని ఎస్వీవీఎస్ హిందూ హైస్కూల్లో ఏపీ రైతు సంఘ ఉమ్మడి జిల్లా కమిటీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏలూరు జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో రైతులు, కౌలురైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలేక పోగా వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగాయన్నారు. పండించిన పంటకు మద్దతు ధర దక్కక అప్పులు పెరిగిపోయి పలువురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ వామపక్షపార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. పెంటపాడు మండల అధ్యక్ష కార్యదర్శులు చిర్ల పుల్లారెడ్డి, కరక వెంకట్రావు, శిరపరపు రంగారావు, లింగంపల్లి శ్రీను, పెనగంటి దుర్గ, అప్పాజీ, తాడి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన తాడేపల్లిగూడెం ఆర్డీఓ



కలెక్టర్ నాగరాణితో తాడేపల్లిగూడెం ఆర్డీఓ

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక కలెక్టరేట్ ఛాంబర్‌లో మంగళవారం కలెక్టర్ చదలవాడ నాగరాణిని తాడేపల్లిగూడెం ఆర్డీఓ యమ్మనూరి భవాని శంకరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వీరికి అభినందనలు తెలిపారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆర్డీఓ భవాని శంకరిని డివిజన్ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలందరూ పట్టణంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీకనకదుర్గా ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పాణి, మధు, రెహ్మాన్‌లు పేర్కొన్నారు.

ప్రకటన

మహారాజ శ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ఔటార్ ఐ.పి.నెం.26/2024

Between
1.రెబ్బా వెంకటేశ్వరరావు
2.రెబ్బా గౌరి
.... పిటీషనర్స్
మరియు
1. కంచుమర్తి వెంకటేశ్వరరావు వగైరాలు
...... రెస్పాండెంట్స్

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నెంబరు గ్రంధములో శ్రీ సినియర్ సివిల్ జడ్జి కోర్టు, తాడేపల్లిగూడెం యందు పిటీషనర్లు తమను ఇన్‌సాల్వెంట్స్‌గా డిక్లేర్ చెయ్యమని ఔటార్ ఐ.పి. పిటీషనను దాఖలు చేసుకొని యున్నారు. ఐ.పి.నెం.26/2024గా నెంబర్ అయ్యి తేది. 4-11-2024 న వాయిదా ఉండి యున్నది. సదరు పిటీషన్‌పై ఎవరికైన అభ్యంతరములు గాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల శ్రీ తాడేపల్లిగూడెం శ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు యెదుట తేది 4-11-2024న ఉదయం 10.30 గంటల, లగాయతు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గానీ హాజరు అయ్యి తమ అభ్యంతరములు తెలియజేయవలెను అని తెలియజేయడమైనది.

ఇట్లు
టి.లీలామాధవ్
డి. సురేష్ కుమార్
న్యాయవాదులు, తాడేపల్లిగూడెం
సెల్ :99486 44899
తాడేపల్లిగూడెం
ది.07-10-2024

ఇవేం గుంతలు బాబోయ్!

- దారులన్నీ దయనీయం
- ఓవర్‌బ్రిడ్జిపై ప్రయాణం నరకం



ఓవర్ బ్రిడ్జి, కాలిబాటపై గోతులు



వానలు కురిసినప్పుడు ఇలా..

తాడేపల్లిగూడెం: రహదారులపై ప్రయాణికి అష్టకష్టాలు తప్పడం లేదు. భారీ వర్షాలకు రోడ్లన్నీ గుంతలుగా మారిపోయాయి. అభివృద్ధి లేదు..రోడ్లు అధ్వానంగా ఉన్నాయంటూ ఊక దంపుడు తప్పుడు ప్రసంగాలు సాగించిన కూటమి పార్టీల నేతలు ఇప్పుడు అధికారంలోకి వచ్చినా వారికి రోడ్లు, గుంతలు కనిపించడం లేదు. రోడ్ల నిర్మాణం కంటే గుంతలు పూడ్చేస్తామని ప్రకటించిన కూటమి నేతలు ఇప్పుడేమో చేతల్లో కాదు.మాటలకే పరిమితమైనట్లు వ్యవహరిస్తున్నారు. ఏం... గోతులు రా నాయనా... నడుం పడిపోతుంది. ఈ గుంటలు కూడా పూడ్చటం లేదు. పక్కన గోడలమీద రంగుల హంగులు కేం తక్కువ లేదు. చస్తున్నాం. ఈ గోతుల్లో బండి మీద వెళ్లాలంటే పట్టణంలోని ఓవర్ బ్రిడ్జిపై ప్రయాణం చేసే వారిలో 90శాతానికి పైగా అనుకొనే మాట ఇదే.. రోజంతా రద్దీగా ఉండే ఓవర్ బ్రిడ్జిపై వాహన చోదకులు గుంతలను తప్పించుకునేందుకు సర్కస్ ఫీట్లు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఈ క్రమంలో అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్న వారు ఎందరో ఉన్నారు. ఇక ఫుట్ బ్రిడ్జిపై నడక మరింత నరకం. పాదచారుల నడక మార్గం ఎక్కడకక్కడ పగుళ్లతో ఉంది. ఆదమరచి కాలు గుంతలో పడిందా. ఎముకల డాక్టర్‌కు సుంకం కట్టాల్సిందే. ఓవర్ బ్రిడ్జి మీద నుంచి తణుకు, ఏలూరు రోడ్లపై ఎక్కడచూసినా ఇదే తరహా గోతులు. గోతుల వల్ల వాహనాలు ఢీకొనడం పదుల సంఖ్యలో ప్రమాదాల బారిన పడినవారు ఉన్నారు. ట్రాఫిక్ ఆగిపోతుంది. వేల సంఖ్యలో జనం నిత్యం రాకపోకలు సాగిస్తున్న ఈ బ్రిడ్జిపై గోతులను వెంటనే పూడ్చి అసౌకర్యాన్ని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడేపల్లిగూడెం: 90102 23729, 90100 68395
తణుకు: 90108 43311, 90100 51493
Office mail : tpgadvt@gmail.com